'గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోండి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలోని ప్రతి గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతి ఉద్యోగి త్వరలో జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్‌జిఒ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరు ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులందరితో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించిన గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫారం-18పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఇంకా ఎవరైనా ఓటరుగా నమోదు కాని పక్షంలో ఈ నెల ఆరో తేదీలోపు ఫారం-18ని పూర్తి చేసి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోగాని, ఆన్‌లైన్‌లోగాని ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

కొండపై నివేదిక ఇవ్వండి

- లక్ష్మి నరసింహస్వామి 50 ఎకరాలు తిరిగి తెస్తాం
- దేవాలయ అభివృద్ధికి రూ.4.50 కోట్లు కేటాయింపు
- మూడు నెలల్లో ఇక్కడ రోడ్లు పూర్తి
- అధికారులు మెతగ్గా ఉంటే కుదరదు
- ఉచిత గ్యాస్ దీపం-2లో డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్
- భారీకేడ్ల ఏర్పాటుపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ద్వారకాతిరుమల

గత ప్రభుత్వ హయాంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద కొండ తవ్వకం ఎవరు సాగించారో.. ఎంత దోచేశారో.. హైవే నిర్మాణానికి వాడారో.. లేదో తేల్చి సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు చెప్పానని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఉచిత గ్యాస్ దీపం-2 పథకాన్ని ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం గ్రామంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. విమానంలో హైదరాబాద్ నుంచి రాజమండ్రి చేరుకున్న డిప్యూటీ సిఎం అక్కడ నుంచి రోడ్డు మార్గంగుండా 12.15 గంటలకు ఐఎస్ జగన్నాథపురం గ్రామానికి చేరుకున్నారు. నేరుగా కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ హోమంలో పాల్గొనిదర్శనం చేసుకున్నారు. అనంతరం ఎంఎల్‌ఎలు, అధికారులతో విడివిడిగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. దీనికి మీడియాను అనుమతించలేదు. అంతర్గత సమాచారం మేరకు దేవాదాయ అధికారుల సమావేశంలో దేవాలయ భూముల పరిరక్షణ గురించి పలు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దేవాదాయ ఆస్తుల రక్షణకు వక్ఫ్‌బోర్డు తరహాలో కార్యాచరణ చేపట్టే యోచన చేస్తున్నట్లు ఆయన చెప్పినట్లు సమాచారం. దాదాపు 60 వేల ఎకరాల ఎండోమెంట్ ఆస్తులు అన్యాక్రాంతమైనట్లు అధికారుల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. అన్యాక్రాంతమైన ఆస్తుల జాబితాను తయారు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. రెండు గంటలకు సభ అని షెడ్యూల్ ఇచ్చినప్పటికీ 3.30 గంటలకు గుడి దిగువన ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకున్నారు. ఉదయమే అక్కడకు చేరుకున్న జనం, అధికారులు ఉక్కబోతకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో చాలామంది నీరసించారు. గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అధ్యక్షతన జరిగిన సభలో తొలుత మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. అనంతరం డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ 14 ఏళ్ల క్రితం ఈ ఆలయానికి వచ్చానని తెలిపారు. ఇక్కడి లక్ష్మి నరసింహ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. దేవాలయ అభివృద్ధిలో భాగంగా ముఖ మండపం, గాలిగోపురం నిర్మాణానికి రూ.2.50 కోట్లు, రక్షణ గోడ నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తిరుమల మాదిరిగా శక్తివంతమైన కేంద్రంగా మారుస్తామన్నారు. లక్ష్మి నరసింహ ఆలయానికి 50 ఎకరాలు భూమి ఉందన్నారు. ఆ భూమి చిక్కులో ఉందని, ఆ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కొండ కింద భాగం నుంచి పైభాగం వరకూ రోడ్డు వేసేందుకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. ఇక్కడకు వచ్చేందుకు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం నుంచి వచ్చే రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. మూడు నెలల్లో ఇవి పూర్తి చేస్తామని అధికారులు చెప్పినట్లు తెలిపారు. కొయ్యలగూడెం మీదుగా ఐఎస్ జగన్నాథపురం వచ్చిన ఆయన మధ్యలో రోడ్డు బాగోలేకపోవడంతో దిగి నడిచారు. దీంతో రోడ్లపై గుంతలను వెంటనే పూడ్చాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ అధికారులు వైసిపి హయాంలో అడ్డగోలుగా వెళ్లారు. ఇప్పుడు ధర్మబద్ధంగా పని చేయమంటే వెనుకాడుతున్నారని అన్నారు. బారీకేడ్ల ఏర్పాటుపై అప్పట్లో వైసిపిపై జనసేన, టిడిపి తీవ్ర విమర్శలు చేసింది. పవన్ పర్యటనలో పెద్దఎత్తున బారీకేడ్లు ఏర్పాటు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. చివరిలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించారు. పవన్ పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్‌తోపాటు ఎంఎల్‌ఎలు, అధికారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

గ్యాస్ పంపిణీ వాహనానికి పచ్చ జెండా ఊపుతున్న పవన్‌కళ్యాణ్

పండుగ వేళ పేలుడు

మోటారు సైకిల్‌పై ఉల్లిపాయ బాంబులు తీసుకెళ్తుండగా ప్రమాదం

ఒకరు దుర్మరణం, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పండుగ వేళ పేలుడు పలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. దీపావళి ముందు రోజు పిడుగుపాటుకు తూర్పుగోదావరి జిల్లా సూర్యారావుపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో పశ్చిమకు చెందిన ఇద్దరు మహిళలు మృతి చెందిన ఘటన మరువకముందే దీపావళి రోజున మిట్టమధ్యాహ్నం ఏలూరు నగరంలో చోటుచేసుకున్న పేలుడు రెండు జిల్లాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురి చేసింది. దీనికి సంబంధించి ఏలూరు వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు వన్‌టౌన్‌కు చెందిన దుర్గాసి సుధాకర్ (30) మున్సిపల్ వాటర్ ట్యాంక్ బోర్ ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. దీపావళి పండుగ కోసం గురువారం మధ్యాహ్నం పెద్దసంఖ్యలో ఉల్లిపాయ బాంబులను కొనుగోలు చేశాడు. వీటిని చిరంజీవి బస్టాండ్ వద్ద కొనుగోలు చేసి అక్కడే వేచి ఉండగా అటుగా వచ్చిన తన స్నేహితుడైన అదే ప్రాంతానికి చెందిన ఎలక్ట్రీషియన్ తాబేలు సాయిరాంను ఆపి మోటారు సైకిల్‌పై ఇంటి వద్ద దింపాలని కోరాడు. ఈ క్రమంలో సుధాకర్ ఆ ఉల్లి బాంబుల బస్తాను మోటారు సైకిల్ (హోండా యాక్టివా) ముందు భాగంలో ఉంచి తానే డ్రైవ్ చేస్తాననడంతో సాయిరాం వెనుక కూర్చున్నాడు. కొత్తగూడెం సెంటర్ మీదుగా వారి ఇంటికి వెళుతుండగా గౌరీదేవి గుడి సమీపానికి చేరుకునేసరికి నాలుగు రోడ్ల కూడలి వద్ద ద్విచక్ర వాహనం చిన్న గుంతలో పడి పైకి లేచింది. దీంతో వాహనంపై ఉన్న ఉల్లిబాంబులు కదిలి విస్ఫోటనం చెందాయి. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న సుధాకర్ శరీరం రెండు భాగాలుగా విడిపోయి హృదయ విదారకర పరిస్థితిలో మృతి చెందాడు. వెనుక కూర్చున్న సాయిరామ్‌తోపాటు అక్కడే రోడ్డుపై నిల్చొని మాట్లాడుకుంటున్న మరో ఏడుగురు గాయాల పాలయ్యారు. పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను హుటాహుటీన జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వీరిలో తీవ్ర గాయాల పాలైన సాయిరాంను అక్కడే ఉంచి చికిత్స అందిస్తుండగా, రోడ్డుపై నిల్చొని ఉన్న మల్ల పెద్దిరాజును ఆశ్రం హాస్పిటల్‌కు, సతీష్‌ను గుంటూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరితోపాటు అక్కడే నిల్చొని ఉన్న శశి, సురేష్, ఖాదర్, పఠాన్, శీను ప్రస్తుతం ఏలూరు సర్వజన ఆస్పత్రిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుని భార్య ప్రస్తుతం గర్భవతి.



మృతుని కుటుంబానికి మంత్రి పార్థసారధి పరామర్శ

క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎస్‌పి

విస్ఫోటనం జరిగిన నాలుగు గంటల్లోనే మంగళగిరి ఫోరెనిక్స్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని పేలుడుకు సంబంధించిన వివరాలను సేకరించారు. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, డిఎస్‌పి శ్రావణ్ కుమార్ పరిశీలించారు. అనంతరం ఎస్‌పి మృతుని కుటుంబాన్ని, క్షతగాత్రులను పరామర్శించారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం

మంత్రి కొలుసు పార్థసారధి

ఏలూరు సిటీ: నగరంలో బాణసంచా పేలుడులో మృతి చెందిన సుధాకర్ కుటుంబాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించారు. శుక్రవారం స్థానిక తూర్పువీధి మారుతీ నగర్‌కు చెందిన దుర్గేసి సుధాకర్ కుటుంబ సభ్యులను ఎంఎల్‌ఎ బడేటి చంటి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, నగర మేయర్ షేక్ నూర్జహాన్, స్థానిక నాయకులు ఎస్‌ఎంఆర్.పెదబాబు, బొద్దాని శ్రీనివాస్‌లతో కలిసి మంత్రి పరామర్శించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం నుండి ఎక్స్‌గ్రేషియా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సుధాకర్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అనంతరం ఈ ఘటనలో గాయపడి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని హాస్పటల్ సిబ్బందిని ఆదేశించారు అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఈ దుర్ఘటన చాలా బాధాకరమన్నారు. మృతుని కుటుంబానికి మున్సిపల్ కార్పొరేషన్ తరపున రూ.రెండు లక్షలు, పార్టీ తరపున ఒక లక్ష రూపాయలు అందజేస్తామన్నారు. క్షతగాత్రులకు రూ.20 వేలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా పోలీస్, అగ్నిమాపక శాఖలు ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. వీరి వెంట ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, తహాశీల్దార్ జివి.శేషగిరి తదితరులు ఉన్నారు.

నేలకొరిగిన వరిచేనును చూపుతున్న రైతు

నేలకొరిగిన వరిచేలు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో సార్వా వరి పంట కోతకొచ్చిన తరుణంలో ఇటీవల కురిసిన వర్షం, వీచిన గాలులకు వరిపంట నేలకొరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పెదగొన్నూరు, ముదినేపల్లి, వడాలి, పెయ్యేరు, బొమ్మనంపాడు తదితర గ్రామాల్లో ఈనిక దశ పూర్తయ్యి గింజ తయారయ్యే దశలో బుధవారం కురిసిన భారీ వర్షానికి పొలాల్లో నీరు నిలిచి వరిపంట నేలకొరిగింది. దీంతో కొంత మేర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో సార్వా వరి సాగవుతోంది. పంట నేలను అంటడంతో దిగుబడి తగ్గడంతోపాటు మద్దతు ధర లభించదేమోనని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ప్రజాశక్తి - దెందులూరు

సీజన్ మారుతున్నప్పుడు సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. అనారోగ్య సమస్య సంభవిస్తే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. స్థానిక పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని రామసింగవరంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మాధవి సూచనల మేరకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొని, ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రారంభమవుతున్న సమయంలో కొన్ని సీజనల్ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని, ముఖ్యంగా చలి వాతావరణం వల్ల దగ్గు, జలుబు, ఆయాసం, ఎలర్జీ కండీషన్స్, వైరల్ ఫీవర్స్ ప్రబలే అవకాశం ఉందని అన్నారు. శీతాకాలంలో వేడి వేడి ఆహార పదార్థాలు భుజించాలని, గోరువెచ్చని నీరు తాగాలని, చలి తగలకుండా ఉన్ని దుస్తులు వాడాలని సూచించారు. దోమల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలని, అక్కడ అవసరమైన రక్త, మూత్ర పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. మందులు ఉచితంగా అందిస్తారని, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో 13 రకాల పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 63 రకాల ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రోజ్ మేరీ, హెల్త్ సూపర్‌వైజర్ రమేష్ బాబు, ఎంఎల్‌హెచ్‌పి శశి కుమార్, ఆరోగ్య కార్యకర్త నాగమణి, మేక శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు మౌనిక కనకదుర్గ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నినదిస్తున్న వైద్యసిబ్బంది

భగత్ సింగ్ ఆశయాలను సాధిస్తాం : డివైఎఫ్ఐ

ఘనంగా డివైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

భగత్ సింగ్ ఆశయాలను సాధిస్తామని డివైఎఫ్ఐ నాయకులు అన్నారు. డివైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెం పట్టణం తొమ్మిదో వార్డ్ అమ్మ వెల్డింగ్ షాప్ వద్ద శుక్రవారం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కె.మాబుసుభాని అధ్యక్షత వహించిగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్, మాజీ నాయకులు పసల సూర్యారావు 1980లో పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా నగరంలో అందరికీ విద్య - అందరికీ ఉపాధి అనే నినాదంతో ఆర్థిక, సామాజిక, లింగ వివక్షతలకు వ్యతిరేకంగా స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో పని చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్యను ఏర్పాటు చేశారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించి దేశంలోని యువత మద్దతు పొంది అతిపెద్ద యువజన సంఘంగా ఎదిగిందని తెలిపారు. నేడు మతోన్మాదంతో, సామ్రాజ్యవాదంతో దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగి యువత పరిస్థితి దరిద్రంగా మారిందని తెలిపారు. యువతి యువకులందరూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ముఖ్యంగా అమెరికా ప్రోత్సలంతో పాలస్తీనా పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఖండించాలని, క్యూబాపై అమెరికా ఆర్థిక నేర్పందాన్ని ఎత్తివేయటానికి పోరాటం చేయాలని అలాగే దేశంలో ఉన్న పరిశ్రమలన్నింటినీ చేసి యువతకు ఉపాధి లేకుండా చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల పైన వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా, యువతకు ఉపాధి లేకుండా తక్కువ వేతనానికే ఎక్కువ పని చేయించుకునే దుర్మార్గానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. యువతి యువకులందరూ ఐక్యంగా ముందుకు కదిలి డివైఎఫ్ఐను మరింత బలోపేతం చేయాలని, అప్పుడే నేటి యువతకు విద్య, ఉపాధి, ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. నిరుద్యోగం అంతం డివైఎఫ్ఐ పంతం డ్రగ్స్ అంతం డివైఎఫ్ఐ పంతం అనే నినాదంతో పనిచేయాలని తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని తొమ్మిదో వార్డులో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, వీధిలైట్ల సమస్యలు ప్రధానంగా ఉన్నాయన్నారు. తక్షణమే సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యల పరిష్కరించాలని కోరారు. అనంతరం పట్టణ మున్సిపల్ ఆఫీసర్ కె.వెంకటరమణకు పట్టణ పౌర సమైక్య కార్యదర్శి వంగ గోపీ, సత్యనారాయణ, పట్టణ కమిటీ సభ్యులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ కమిటీ సభ్యులు, పట్టణ పౌర సమైక్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఎస్‌సిలకు ఉచిత విద్యుత్ రాయితీ అందించాలి

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రాయితీని సక్రమంగా అమలు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి కోరారు. మండలంలోని రెడ్డిగణపవరం గ్రామంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ మండల పరిధిలో ఎస్‌సిల కరెంట్ మీటర్లను తొలగించిన అధికారులపై, ఎస్‌సిల ఇళ్ల మీటర్లను పట్టుకెళ్లిపోయిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అధికారులు ఏజెన్సీ ప్రాంతంలో అమాయక దళిత గిరిజనులపై బెదిరింపులకు పాల్పడి అక్రమంగా విద్యుత్ బిల్లు కట్టిస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ అధికారుల అరాచకాలను రాష్ట్ర మంత్రివర్గం దృష్టికి, రాష్ట్ర విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని అమలు చేయడంలో కమిటీ వేయటంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఈ కమిటీలు సమావేశాలు జరిగితే ఇలాంటివి చోటు చేసుకోవన్నారు. ఆ రకంగా ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి తీసేసిన మీటర్లను బిగించాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి ఉచిత విద్యుత్‌పై ప్రకటన చేయాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదన్నారు. బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం గ్రామాల్లో దళితులపై అధికారుల దాడులు ఆపాలని, లేకపోతే న్యాయస్థానంలో కేసులు వేస్తామని చెప్పారు. దళితుల విద్యుత్ మీటర్లు పీకేసిన అధికారులపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ అన్నారు. ఈ కార్యక్రమంలో మొగలి గంగరాజు, కె.కొండయ్య, మారయ్య, బాబూరావు, జి.దుర్గమ్మ, రమాదేవి, అమిర్ల దుర్గమ్మ, చంద్రరావు, సుబ్బారావు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న మాల్యాద్రి

ఎన్నికల హామీల అమలే లక్ష్యం

చింతలపూడి అభివృద్ధికి సహకరిస్తాం

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. దీపం పథకంలో సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేస్తున్నామన్నారు. మండలంలోని ఆర్‌కె ఫంక్షన్ హాలు వద్ద శుక్రవారం నిర్వహించిన దీపం-2 పథకం కార్యక్రమనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే పరిపాలన బాగా చేసి చూపిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం దోచుకొని దాచుకుందన్నారు. దీపం పథకంతో మహిళలకు ప్రయోజనం ఎంతో ఉంటుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి వాటిని నెరవేర్చడమే టిడిపి కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి రూ.2,684 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మొదటి విడతగా రూ.894 కోట్లు గ్యాస్ కంపెనీలకు చెల్లించిందని, గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న ఖాతాదారులకు సంబంధిత కంపెనీలు ఇంటికి వచ్చి సిలిండర్లను పంపిణీ చేస్తారని వివరించారు. లబ్ధిదారులు డబ్బులు చెల్లిస్తే 48 గంటల్లో తిరిగి డబ్బులు మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ప్రధాన మంత్రి మోడీ వల్ల రాష్ట్రాభివృద్ధికి నిధులు ఇస్తున్నారని, అండగా ఉంటున్నారని చెప్పారు. పెన్షన్ పెంపు చేశామని, గత ప్రభుత్వం రూ.500 పెంచటానికి సంవత్సరం పట్టిందని, చంద్రబాబుకు ఒక్కరోజు పట్టిందని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామన్నారు. చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. 20 లక్షల ఉద్యోగావకాశలు నిరుద్యోగులకు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. 2014 నుంచి 2019 సంవత్సరలో ఇల్లు కట్టుకుని బిల్లులు పడని వారికి బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జనవరి నాటికి రోడ్లపై ఎక్కడ గుంతలు ఉండకూడదని చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణనికి రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో రోడ్లకు రూ.ఆరు కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి హయాంలో చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ.పది వేల కోట్లు ఖర్చు పెడితే వైసిపి ప్రభుత్వం రూ.పది కోట్లు కూడా ఖర్చు పెట్టలేదన్నారు. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్ట్ పూర్తి చేసిన తర్వాతే ఓట్లు అడగడానికి వస్తామన్నారు. చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ గతంలో కట్టెల పొయ్యి మీద వంటలు చేస్తుంటే ఆ పొగ వల్ల ఏ ఆడపడుచూ కంట కన్నీరు రాకూడదనే నాటి చంద్రబాబు ఆలోచన దీపం పథకమని చెప్పారు. ప్రతి పేదింటి ఆడబిడ్డ దీపం పథకం గ్యాస్ కనెక్షన్‌తో నాడు కష్టాల నుంచి విముక్తులయ్యారన్నారు. మళ్లీ ఆడపడుచులకు గ్యాస్ సిలిండర్ విషయంలో చేదోడుగా ఉండాలని నిర్ణయించి ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం మహిళలకు ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఆడపడుచుల కళ్లల్లో ఆనందం కోసం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో మూడోది ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు కూటమి ప్రభుత్వం నేడు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ఆర్‌డిఒ వాణి, నగర పంచాయతీ కమిషనర్ పావని, మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ, దాసరి శేషు, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, పెదబాబు, మాటూరి వెంకటరామయ్య, కొండ్రు దేవా, బోడ నాగ భూషణం, బిజెపి జిల్లా నాయకులు విక్రమ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ఆక్రమణ భూమిపై విచారణ జరపాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆక్రమణకు గురైన సాగుభూమిపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని దళిత సేన పక్షాన జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావును దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ కలిసి లింగపాలెం మండలం మఠంగూడెం గ్రామానికి చెందిన దాదినిబోయిన చంద్రశేఖర్ సాగు భూమి ఇటీవల ఆక్రమణకు గురైందని తెలిపారు. భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపించాలని, బాధితులకు న్యాయం చేయాలని రవిప్రకాష్ కోరారు. ఈ విషయమై విచారణ చేయిస్తామని డిఆర్‌ఒ తెలిపారు. డిఆర్‌ఒను కలిసిన వారిలో దళిత సేన ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్క పాము చంటి, బాధితుడు చంద్రశేఖర్ ఉన్నారు.

పునరావాస కాలనీలో కొండచిలువ హతం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ఇటుకలకోట, పైడిపాక పునరావాస కాలనీలో శుక్రవారం గ్రామస్తులు భారీ కొండచిలువను హతమార్చారు. పైడిపాక పునరావాస కాలనీకి సమీపంలో ఉన్న అడవుల్లో నుంచి సుమారు 12 అడుగుల పొడవు ఉన్న కొండచిలువ గ్రామంలోకి చొరబడడంతో కుక్కలు, కోళ్లు భయపడి అరవడంతో అప్రమత్తమైన గ్రామంలో యువకులు గమనించి కొండచిలువను హతమార్చారు. గ్రామానికి సమీపంలో ఆడవులు ఉండడం కాలనీల్లో కొన్ని అసంపూర్ణంగా నిర్మించిన కాలనీల చుట్టూ చెట్లు, పొదలు చిన్న సైజు అడవిలా తయారవ్వడంతో పాటు వీధి దీపాలు సరిగా వెలగకపోవడంతో తరచూ పాములు, విష కీటకాల సంచారిస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో దినదిన గండంగా భయాందోళనలతో గడపాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హతమైన కొండచిలువ

సైకిల్ షెడ్డును ప్రారంభిస్తున్న సుధారాణి

పాఠశాలలో సైకిల్‌షెడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యార్థుల సౌకర్యార్థం శిథిలావస్థలో ఉన్న సైకిల్‌షెడ్డును చుక్కపల్లి ఛారిటబుల్ ట్రస్టు వితరణతో పున:నిర్మించడం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత అన్నారు. చుక్కపల్లి ఛారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయంతో ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పున:నిర్మించిన సైకిల్ షెడ్డును ట్రస్టు కార్యదర్శి చుక్కపల్లి సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, అంకితభావంతో విద్యనభ్యసించినట్లయితే రానున్న రోజుల్లో చుక్కపల్లి ఛారిటబుల్ ట్రస్టు తరఫున మధ్యాహ్న భోజన పథక షెడ్డును సైతం నిర్మించి ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సుధారాణిని ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయడమే లక్ష్యం

గుప్తా ఫౌండేషన్ అధినేత మడిపల్లి మోహన్ గుప్త

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వెంకన్న చెరువు వద్ద ఉన్న శ్మశానవాటికను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని గుప్తా ఫౌండేషన్ అధినేత మడిపల్లి మోహన్ గుప్త తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గుప్తా ఫౌండేషన్ అధినేత మడిపల్లి మోహన్ గుప్తా 80వ పుట్టినరోజు వేడుకలను ఏలూరులోని నేరెళ్ల రాజా కళ్యాణమండపంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ, మడిపల్లి మోహన్ గుప్త పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోహన్ గుప్తా మాట్లాడుతూ ఈ గుప్తా ఫౌండేషన్‌ను 1989లో మోహన్ గుప్త ప్రారంభించారని తెలిపారు. ఏలూరు నగరంలోని వెంకన్న చెరువు వద్ద ఉన్న శ్మశానవాటికను కోటి రూపాయలతో అభివృద్ధి చేసేందుకు స్థానిక ఎంఎల్ఎతో కలిసి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. వంగాయగూడెం గుడ్ సమరిటన్ కేన్సర్ హాస్పిటల్‌కు రూ.15 లక్షల విలువైన పూర్తిస్థాయి అంబులెన్స్ వాహనాన్ని ఇస్తున్నట్లు, రూ.మూడు లక్షలతో వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంటను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా రూ.నాలుగు లక్షల విలువైన ఎలక్ట్రిక్ ఆటోను ఐ.భీమవరంలో ఉన్న శ్రీవెంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం వారికి అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ సంవత్సరానికి శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కారాన్ని కొవ్వూరి లలిత కుమారికి ఇవ్వనున్నట్లు తెలిపారు. గుప్తా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన తర్వాత వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి తమ తండ్రిగారి పేరుపై శ్రీకృష్ణమూర్తి సాహిత్య పురస్కారం అవార్డును ఇప్పటివరకు 20 మందికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు శ్రీనివాస్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి కూటమి ప్రభుత్వం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి ఏలూరు సిటీ

మహిళా పక్షపాత ప్రభుత్వంగా పేరుగాంచిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతి ఇంటా ఉచిత గ్యాస్ వెలుగులు నింపేలా పటిష్ట చర్యలు చేపట్టిందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి వెల్లడించారు. రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన హామీల్లో భాగంగా దశలవారీగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామంటూ ధీమా వ్యక్తం చేశారు. ఏలూరు 48వ డివిజన్ శివగోపాలపురంలోని గంగానమ్మ ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పథకం ప్రారంభంలో భాగంగా పలువురు మహిళలకు గ్యాస్ సిలిండర్లను అందించడంతో పాటు, ఉచిత గ్యాస్‌ను బుక్ చేసుకున్న లబ్ధిదారులకు సరఫరా చేసేందుకు సిద్ధమైన సిలిండర్ల ఆటోను మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ఎంఎల్ఎ బడేటి చంటి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు అర్హతే ప్రామాణికంగా ఉచిత గ్యాస్ సిలిండర్ అందించే ఆలోచన చేయడం కూటమి ప్రభుత్వాధినేతల పాలనాదక్షతకు నిదర్శనమన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు తొలి విడతగా పథకం పొందేందుకు సమయం ఉన్నందున లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవలం రూ.836 చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకుంటే 48 గంటల్లోపే ఆ డబ్బు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతుందని తెలిపారు. ఈ విషయంలో ఎటువంటి సందేహం ఉన్నా లబ్ధిదారులు స్వయంగా తనను సంప్రదించాలని ఎంఎల్ఎ తెలిపారు. మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలుకు కూటమి ప్రభుత్వాధినేతలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. ఏలూరు నియోజకవర్గంలో అహర్నిశలు ప్రజా సమస్యల పరిష్కారానికి తహతహలాడే వ్యక్తి ఎంఎల్ఎగా ఎన్నికవ్వడం శుభపరిణామమన్నారు. నిత్యం అందరికీ అందుబాటులో ఉంటూ, కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టే ఎంఎల్ఎ బడేటి చంటి సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఏలూరు అర్బన్ తహశీల్దార్ జివి.శేషగిరి, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ రమేష్‌కుమార్, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు గ్రామీణ వైద్యుల సాయం

ప్రజాశక్తి - కలిదిండి

వరద బాధితుల సహాయార్థం సిఎం సహాయ నిధికి రూ.1,01,592 అందించినట్లు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ బి.వెంకటరాజు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడును ఎంఎల్ఎ కాగిత కృష్ణప్రసాద్ సారథ్యంలో సెక్రటేరియట్‌లో కలిసి నగదు చెక్కును అందించినట్లు తెలిపారు.


చంద్రబాబుతో బి.వెంకటరాజు

ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - టి.నరసాపురం :

మండలంలోని మక్కినవారిగూడెంలో శుక్రవారం ముఠా వర్కర్స్ ఆధ్వర్యంలో ఎఐటియుసి 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తొలుత యూనియన్ అధ్యక్షులు కాళహస్తి సుబ్బారావు ఎఐటియుసి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షులు టివిఎస్.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఏరియా ఉపాధ్యక్షుడు కొండముచ్చు శ్రీనివాసరావు, యూనియన్ సీనియర్ నాయకుడు మల్లెల సత్యనారాయణ, బైగాని ఏకాంబరం, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - మండవల్లి

కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మండవల్లి ఎస్ఐ రామచంద్ర తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని భైరవపట్నంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోడిపుంజును, ఒక కత్తిని, రూ.5,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు. కోడిపందేలు, పేకాట నిర్వహించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. ఎవరైనా నిర్వహిస్తున్నారని తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు.

కలిదిండి : మండలంలోని మట్టగుంట శివారులో కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.35,00 నగదు, కోడిపుంజును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

ఎంపిపి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

వైసిపి ప్రభుత్వంలో గత మూడేళ్లలో ముదినేపల్లి మండలంలో సుమారు రూ.పది కోట్ల నిధులతో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు ఎంపిపి రామిశెట్టి వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసినట్లు తెలిపారు. అప్పటి ఎంఎల్ఎ డి.నాగేశ్వరరావు ఆదేశాల మేరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నూతన సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేశామన్నారు. గత 20 ఏళ్ల నుంచి అధ్వాన స్థితిలో ఉన్న మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా మార్చేందుకు ఎంఎల్ఎ చొరవ చూపడంతో ఎంఎల్ఎ నిధులు రూ.ఎనిమిది కోట్లు, మండల పరిషత్ నిధులు రూ.రెండు కోట్లతో పనులు చేసినట్లు తెలిపారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. మండలంలోని ఎక్కువ గ్రామాల్లో వరిసాగు అవుతుందన్నారు. నియోజకవర్గంలో ముదినేపల్లి మండలంలో అధిక విస్తీర్ణంలో 15 వేల ఎకరాల్లో వరి సాగు ఉందన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ లేకపోవడంతో వరి సాగు చేసే రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వరి పంటలు పండిస్తున్న ముదినేపల్లి మండలంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని గత వైసిపి ప్రభుత్వంలో అప్పటి సిఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు.

సిఎం సానుకూలంగా స్పందించి వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటుకు ఒక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వరి రైతులు ధాన్యాన్ని కైకలూరు, కలిదిండి, మండవల్లి యార్డ్ రవాణా చేయడంతో ఖర్చులు విపరీతంగా పెరిగాయన్నారు. ఈ మండలంలో పండించిన ధాన్యాన్ని విక్రయించాలంటే స్థానికంగా మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాల ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరి కొంత రంగుమారే అవకాశమున్నందున ప్రభుత్వం రైతుల పట్ల కనికరం చూపించాలన్నారు. రైతులు సైతం వరిలో తేమ 17 శాతం ఉండేలా మార్కెట్ యార్డ్ తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ అందుబాటులో ఉంటే రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెడితే రైతులకు గిట్టుబాటు ధర వస్తుందన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దృష్టికి వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటుకు తీసుకెళ్తానన్నారు. మిగిలిన సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలను పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

త్యాగశీలి పొట్టి శ్రీరాములు

ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తెలుగువారికి భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పోరాడి ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను అర్పించి మనకు తెలుగు రాష్ట్రాన్ని ప్రత్యేకంగా రూపొందించిన త్యాగశీలి పొట్టి శ్రీరాములు అని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ఆర్ఆర్.పేటలోని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ముందుగా క్షవర వృత్తిదారుల సంఘం నాయకులు రాజు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూతయిత వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పోరాడిన యోధుడు పొట్టి శ్రీరాములు అని, 56 రోజులపాటు మద్రాసు నగరంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుని ఆత్మబలిదానం చేసుకుంటే తప్ప కేంద్ర ప్రభుత్వం తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వలేదని తెలిపారు. బిసి జెఎసి నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు అంతిమ దశలో చాలా అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్నారని, వారి మరణం తెలుగు ప్రజలకు తీరని లోటని తెలిపారు.

ముసునూరు : ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మండలంలోని 16 గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ప్రయివేట్ పాఠశాలల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ శర్మ , ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, పలు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు గంప వెంకట్రావు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సిద్ధికి ఆత్మార్పణ చేసిన ఆంధ్రుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు. భారతదేశ మున భాషా ప్రయుక్త రాష్ట్రాలకు శ్రీకారం చుట్టిన మహానుభావుడు పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. పొట్టిశ్రీరాములు సిసలైన గాంధీయవాది అన్నారు. తన ఆశయ సిద్ధికి ప్రాణాలను కూడా లెక్క చేయని సాహసి. హరిజనోద్ధరణ, సతత జనోద్ధరణకు, సాంఘిక సేవకు ఆయన చేసిన సేవ చిరస్మరణీయమైందన్నారు. శ్రీరాములు 19 అక్టోబర్ 1952లో నిరాహార దీక్ష ప్రారంభించి 58 రోజుల నిరాహార దీక్ష చేసి 15 డిసెంబర్ 1952లో ప్రాణాలు వదిలారన్నారు. అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ రాష్ట్ర ఆవిర్భావానికి మాట ఇచ్చారన్నారు. 1956 నవంబర్ 1న రాష్ట్రం ఏర్పాటైందన్నారు.

కలిదిండి : రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వూర శ్రీధర్, టౌన్ అధ్యక్షులు, ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్, వాసవీ క్లబ్ జోన్ ఛైర్మన్ నూకల శ్యామలరావు గుప్తా పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబ్జీ, సునీల్, చక్కా జగన్మోహనరావు పాల్గొన్నారు.

బాధితునికి పండ్లు అందిస్తున్న సిపిఎం నాయకులు

అనారోగ్య బాధితునికి సిపిఎం పరామర్శ

కుక్కునూరు : అనారోగ్యంతో బాధపడుతున్న కుక్కునూరు మండలంలోని సంజీవ్ నగర్ కాలనీకి చెందిన వనమా సత్యంను సిపిఎం నాయకులు శుక్రవారం పరామర్శించారు. 80 ఏళ్లుగా ఊరికి పెద్దగా ఉంటూ కుక్కునూరులో ఎవరు మరణించిన నేనున్నానంటూ ముందుకు వచ్చేవారన్నారు. సుమారు 500 కుటుంబాలకు తానే దగ్గరుండి కర్మకాండలు జరిపించేవారు. అనారోగ్యంతో బాధపడుతూ లేవలేని స్థితిలో ఉన్న వనమా సత్యంను సిపిఎం నాయకులు పరామర్శించి కొంత నగదు, పండ్లు, బ్రెడ్లు ఇచ్చి ఎప్పుడూ తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి ఎర్రం శెట్టి నాగేంద్రరావు, సీనియర్ నాయకులు దాస్, రమేష్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో దీపావళి వేడుకలు

నూజివీడు టౌన్: నూజివీడు ట్రిపుల్ ఐటీలో గురువారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్టూడెంట్ మిత్ర బృందం ఇగ్నైటర్ 2కె 24 పేరుతో ఘనంగా నిర్వహించిన ఈ వేడుక అందరినీ ఆకర్షించింది. దీపాల అలంకరణ వెలుగులో ట్రిపుల్ ఐటీ ముస్తాబైంది. మన సంస్కృతిని ప్రతిబింబించేలా దీపాల అలంకరణ, లైటింగ్‌లు, బోనాఫైర్ చుట్టూ దాండియా నృత్యాలు, రంగోలి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాన్ని ఆర్‌జియుకెటి నూజివీడు డైరెక్టర్, రిజిస్ట్రార్ డాక్టర్ అమరేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ వేడుకలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ బి.లక్ష్మణ్‌రావు, డిఎస్‌డబ్ల్యూ అధికారులు ఎ.బ్రహ్మస్వాములు, టి.దుర్గాభవాని, చీఫ్ వార్డెన్ లక్ష్మణరావు, స్టూడెంట్ మిత్ర ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ డివి.నాగార్జునదేవి, స్టూడెంట్ మిత్ర అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఇగ్నైటర్ 2కె 24 ఈవెంట్ స్పాన్సర్లు ఫ్యూచర్ ఫార్చ్యూన్, ఎస్‌కె.శర్మ కన్సల్టెన్సీ, శ్రీకాంత్ బ్రిడ్జి ఓవర్‌సీస్ కన్సల్టెన్సీ, ఉగ్యాన్ ఎడుటెక్, అనిక్ హైర్వెల్, అడ్మినిస్ట్రేషన్ సహకారంతో దిగ్విజయంగా ముగిసింది.

ట్రై సైకిల్ పంపిణీ

ముదినేపల్లి : రోటరీ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ట్రై సైకిల్‌ని అందించడం అభినందనీయమని కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లి కూటమి కార్యాలయంలో వికలాంగ వృద్ధుడు గోవిందరాజుకు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ చేతుల మీదుగా ట్రైసైకిల్‌ని అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి, కూటమి నాయకులు, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్, ఎఎన్.బాబు, బొర్రా చలమయ్య, శొంఠి నాగరాజు పాల్గొన్నారు.

పట్టిసీమలో కార్తీకమాసం ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - పోలవరం

కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రంలో యాత్రికులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. భక్తులు గోదావరి నది దాటి ఇసుక తిన్నెల్లో సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేందుకు ఇసుకతిన్నెల్లో విద్యుద్దీపాలు, ఆలయ ప్రాంగణంలో రద్దీ నివారణకు క్యూలైన్లు, క్యూలైన్లలో ఫేన్లు, బారికేడింగులు, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మరమ్మతులకు గురైన తాగునీటి ఆర్ఓ సిస్టంను పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకొచ్చారు. గోదావరి నదీ తీరంలో భక్తులు స్నానాలాచరించేందుకు నదిలో భారీ కేడింగులు, హెచ్చరిక బోర్డులు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం కార్తీకమాసం నెలరోజులు నిత్యాన్నదానం, అల్పాహారం, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సిబ్బంది వెంకట్రాజు తెలిపారు. ఈ నెల రెండో తేదీ నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకూ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయి. పట్టిసీమ ఫెర్రీ రేవులో స్నానాల గదుల ఏర్పాటు, నదీ తీరాల వద్ద హెచ్చరిక బోర్డులు, నదీ స్నానాల వద్ద బారికేడింగులు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు, పట్టిసీమ పెర్రీ రేవులో మరుగుదొడ్లు శుభ్రం చేయించి నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తెచ్చినట్లు, మండలంలో పోలవరంలో రెండు స్నాన ఘట్టాల్లో, కొత్తపట్టిసీమ, గూటాల గ్రామాల్లో స్నాన పట్టాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు, బట్టలు మార్చుకునే గదులు, నదీ స్నానాల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు, బారికేడింగులు ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ ఇ.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి తెలిపారు.

మధుర జ్ఞాపకాలు చూపగలిగే వారే ఫొటోగ్రాఫర్లు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎన్నో అద్భుతమైన చిత్రాలను బంధించి మధుర జ్ఞాపకాలుగా చూపరులకు అందించే వారే ఫొటోగ్రాఫర్లని ఎఎస్ఐ వి.జయకుమార్, టి.నరసాపురం జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎంబి, లింగుస్వామి అన్నారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్ వద్ద ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో నిర్మించిన లూయిస్ డాగూరే బస్ షెల్టర్ వద్ద శుక్రవారం ఫొటోగ్రాఫర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక జిల్లా కార్యదర్శి విఆర్.చిన్ని ఆధ్వర్యంలో నిర్వహించారు. యూనియన్ నూతన కమిటీ ప్రెసిడెంట్ ఆర్.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ జి.మహారాజు, కార్యదర్శి పి.చందు, జాయింట్ సెక్రటరీ టి.సురేష్, కోశాధికారి ఎం.వాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి, కామవరపుకోట, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

'నాయీ బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట'

చింతలపూడి : కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు పెద్దపీట వేసిందని టిడిపి జిల్లా సాధికార కమిటీ అధ్యక్షులు కొప్పెర్ల నాగరాజు అన్నారు. మండలంలోని ప్రగడవరంలో నాయీ బ్రాహ్మణులందరూ సిఎం చంద్రబాబుకు పాలాభిషేకం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్‌గా వైద్యం శాంతారామ్‌ని నియమించటం పట్ల నాయీ బ్రాహ్మణులందరూ హర్షం వ్యక్తం చేస్తూ ప్రగడవరంలో పాలాభిషేకం చేశారు. ఈ సందరర్భంగా కొప్పెర్ల నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు పెద్దపీట వేసిందని చెప్పారు. దేవాలయాల్లో పనిచేసేవారికి 25 వేల దేవాలయాల కమిటీలు ప్రాధాన్యంగాని, అలాగే పెద్ద తిరుపతి బోర్డు మెంబర్‌గా నియమించటం చాలా సంతోషదాయకమని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు పొందబోతున్నామని, మనమందరం ఎన్నికల్లో తీసుకున్న హామీలను త్వరలో నెరవేర్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందడుగు వేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు మెంబర్ జగ్గవరపు శ్రీనివాసరెడ్డి, నాయీ బ్రాహ్మణుల జిల్లా అధికార ప్రతినిధి శ్రీను, సత్యనారాయణ, పుల్లారావు, వెంకటేశ్వరరావు, త్యాగరాజు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే గ్రామసభలు

ప్రజాశక్తి - కలిదిండి


మట్టగుంటలో గ్రామసభ

భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకునేందుకు జరుగుతున్న రీ సర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. విస్తీర్ణంలో లోపాలు, పేరు, ఆధార్, ఫొటో మార్పు చేర్పులు, పాసు పుస్తకాలు వంటి సమస్యలు పరిష్కరించుకోవచ్చని రైతులకు తెలిపారు. సర్పంచి అంద్రాజు రత్నమణి, రీ సర్వే డిటి ఆనంద్‌కుమార్, సర్వేయర్ మహ్మద్ షమీ, ఆర్ఐ శ్యామల, విఆర్ఒలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు భరోసాగా సామాజిక పింఛన్లు

ప్రజాశక్తి - చింతలపూడి

సామాజిక పింఛన్లు పేదలకు భరోసాగా నిలుస్తున్నాయని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కొంతమంది లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ల నగదును అందించి వారి యోగక్షేమాలపై ఆరా తీశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ మీకు ఎప్పటి నుంచి పెన్షన్లు వస్తున్నాయి, ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ అందిస్తున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల నుంచి సంతృప్తికరమైన సమాధానం రావడంతో ఎంఎల్ఎ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : సమాజ శ్రేయస్సే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీని ఒక యజ్ఞంలా నిర్వహిస్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. స్థానిక 6, 7 డివిజన్‌లలో శుక్రవారం లబ్ధిదారుల ఇళ్లకే నేరుగా వెళ్లి పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ ప్రజల కోసం ప్రభుత్వం అనే నినాదంతో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం దశలవారీగా ఎన్నికల మేనిఫెస్టో అమలుకు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా పింఛన్ల పంపిణీని బాధ్యతగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. జనసేన ఏలూరు ఇన్‌ఛార్జ్ రెడ్డి అప్పలనాయుడు, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి పాతరేస్తే, తిరిగి కూటమి ప్రభుత్వం ఊపిరిలూదుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడి : సామాజిక పెన్షన్ పంపిణీలో భాగంగా సర్వర్ పని చేయకపోవటంతో పెన్షన్ పంపిణీ ఆలస్యమైంది. సచివాలయం వద్ద పెన్షన్ కోసం వృద్ధులు పడిగాపులు పడ్డారు. ఇంటింటికీ పెన్షన్ ఇవ్వటానికి రాకపోవటంతో వృద్ధులు పెన్షన్ల కోసం సచివాలయం వద్దకు తరలివెళ్లారు.

ముసునూరు : వాలంటీర్లతో పని లేకుండా నెలలో ఒకటో తేదీనే పింఛన్లు అందించిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, మండలాధ్యక్షులు దేవినేని ధలరామ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను టిడిపి నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మెదరమెట్ల సురేంద్ర, కొండేటి బాబి, పాకనాటి సీతారామాంజనేయులు, నక్క యోహాన్, తోట శ్రీనివాసరావు, గార్లపాటి నరసింహారావు, రాపర్ల బాలకృష్ణ, సూర్యదేవర శ్రీనివాసరావు, కండేపు రామగిరిరావు, పులిబళ్ల లక్ష్మీసత్యనారాయణ, మండలపు ధర్మరాజు, రంగు వాసు, కాంతారావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా 4,280 పెన్షన్లకు 3,767 ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను సచివాలయ సిబ్బందితో శుక్రవారం పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. మధ్యలో కొంతసేపు సాంకేతిక లోపంతో పెన్షన్ల ప్రక్రియ నిలిచిపోవడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెన్షన్ దారులు సిబ్బంది కోసం ఎదురుచూశారు. అనంతరం మళ్లీ ప్రారంభించగా మొదటి రోజు మండలం మొత్తమ్మీద కలిపి 88 శాతం వరకు పెన్షన్ల ప్రక్రియ పూర్తయినట్లు ఆమె తెలిపారు.

పోలవరం : మండల ప్రజాపరిషత్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ప్రగడపల్లి, జిల్లెళ్లగూడెం, ఎల్లండిపేట, ఇటుకలకోట, వింజరం, కొండ్రుకోట పంచాయతీల్లో అధికారులతో పాటు స్థానిక కూటమి నాయకులు కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రూ.పది నాణేలు చెల్లవనేది అపోహే

ప్రజాశక్తి - మండవల్లి

రూ.పది నాణేలు చెల్లవనేది అపోహలు మాత్రమేనని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. కలెక్టర్ ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక ఇండియన్ బ్యాంక్ కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకుల వద్ద రూ.పది బిల్లలు వివిధ రూపాల్లో ముద్రించిన ఫ్లెక్స్ బ్యానర్‌ను ప్రదర్శించి శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిరాణా బట్టికొట్లు, చిన్నచిన్న హోటల్లో, కూరగాయల వ్యాపారులు రూ.పది నాణేలు తీసుకునేందుకు నిరాకరించడంతో తిరిగి ప్రజలు తీసుకోవడం లేదన్నారు. రూ.పది నాణేలు చెల్లవనేది అపోహ మాత్రమేనన్నారు. వర్తకులు, ప్రజలు చిల్లర నాణేల కొరతతో ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రూ.పది నాణేల వాడకంతో చిల్లరతో ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ప్రతిఒక్కరూ రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలను అనుసరించి రూ.పది నాణేలు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. రూ.పది నాణేలు చెల్లవన్న అపోహలను తొలగించేలా ప్రజలను చైతన్యపరిచేందుకు బ్యాంకులు స్వచ్ఛంద, సంస్థలు ముందుకొచ్చి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు టి.అప్పారావు, కోశాధికారి బండారు వెంకయ్య పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా టిడిపి'

నూజివీడు టౌన్ : కార్యకర్తలకు టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం టిడిపి సభ్యత్వ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.100 సభ్యత్వంతో రూ.ఐదు లక్షల ప్రమాద బీమాను టిడిపి అందిస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అవ్వ తాతలకు రూ.నాలుగు వేలు పింఛన్‌తో పాటు రీ సర్వే రద్దు, మెగా డిఎస్‌సి, దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ బండ్ల మంజూరును ప్రవేశపెట్టిన సిఎం చంద్రబాబు అభివృద్ధి సంక్షేమ పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని ముందడుగు వేయిస్తున్నారన్నారు.

ముసునూరు : మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకటన

గుండుగొలను కాపురస్తులు శ్రీ తల్లిబోయిన వెంకటన్న గారి భార్య శ్రీమతి వెంకటలక్ష్మి గారు వారి పేరున గల క్రయ దస్తావేజు తేది 24-07-2019 నందు కొనుగోలు చేసిన ఆస్తి తనఖాపై అప్పు తీసుకొనుటకు పిరామిల్ హౌసింగ్ ఫైనాన్స్, ఏలూరు వారిని సంప్రదించినారు. వీరి క్రయ దస్తావేజు తాలూకా లింకు డాక్యుమెంటు అయిన **క్రయ దస్తావేజు నెం.2614/2004 తేదీ 23-06-2004 మార్గమధ్యమున పోయినట్లుగా గుర్తించినారు వారి ప్రయత్నము ఫలించలేదు.** కావున ఈ డాక్యుమెంటు దొరికిన వారు ఇవ్వవలసినదిగా కోరటమయినది. మరియు ఈ తనఖా అప్పు విషయములలో ఎవరికైనా అభ్యంతరములు ఉన్నచో వారం రోజులులోగా తెలియచేయ కోరుచున్నాము.

పి.యస్.చంద్
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 9440111566

ఏలూరు,
01-11-24.

IN THE COURT OF THE Prl. Sr. CIVIL JUDGE, ELURU
FDIA.5/24 in O.S.471/2016

Between:
Pippara Vara lakshmi,
W/o.Venkateswara Rao,
Jangareddygudem
...Petitioner/Plaintiff

R1: Kistarapu Nagamani & 9 Others
Kistarapu Nagamani,
W/o.Koteswara Rao, Easten Street, Eluru.
R3: Peddada Anuradha,
W/o.Sulochanarao, SC Peta,
Rayalam, Bhimavaram.
R4: Srungavruksham Satyavathi,
W/o.Rama Mohanarao (Late),
Sree Rama Nagar, 5th Road,
Gavaravaram, Eluru.
R6: Srungavruksham Kishore kumar,
S/o.Late Rama Mohana Rao, Sree Rama Nagar, 5th Road, Gavaravaram, Eluru.

పై నెంబరు FDIA లో మీరు R1 R3 R4 R6లుగా ఉన్నారు. శ్రీకోర్టు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినను అమలు జరగని కారణంచే శ్రీకోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా నోటీసులు అమలుకు ఉత్తర్వులు ఇచ్చినారు.. సదరు వాయిదా **ది.26-11-2024న ఉదయం 10.30 లకు** పైకోర్టు వారి ఎదుట మీరు గాని మీ అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు కాగలరు. లేని ఎడల మీ పరోక్షంగా విచారించబడును.
శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు

Budigina Nagendra Kumar, Advocate,
Jangareddygudem. Cell:9440314862.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.37/2016

బిట్వీన్:
చిటికిన సూర్యచంద్రరావు (డైడ్)
చిటికిన పార్వతి అండ్ అదర్స్
...పిటీషనర్లు /వాదులు

మరియు

వేముల కృష్ణ మూర్తి అండ్ అదర్స్
...రెస్పాండెంట్స్

టు: శ్రీమతి అంగర రాజ్యలక్ష్మి, భర్త: గోవిందు, C/o.తండ్రి: చిటికిన పార్వతి, డో.నెం.8-104/2, గౌడపేట, మోర్త గ్రామం, ఉండ్రాజవరం మండలం, తణుకు పి.జె.సి.జె.

పై నెంబరు గ్రంధములో మీకు శ్రీ కోర్టు ద్వారా ఎన్నిపర్యాయములు (నోటీసులు) సమన్లు పంపియున్నప్పటికీ మీరు తీసుకోవటం లేదు అని శ్రీ పై కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా ది.04-11-2024న ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు కమ్మని ఆర్డరు వేసియున్నారు. మీరు **ది.04-11-2024న ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేక ప్లీడరు ద్వారా కాని హాజరు అయ్యి ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియపర్చుకొనవలెను.** లేని ఎడల మీ పై పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్పుచెప్పబడును.

P.PADMAVATHI
B.SRINIVASA PRASAD
Advocates,
Tadepalligudem,
Pentapadu.

Tadepalligudem,
01-11-2024.